క్లుప్తంగా

అబుల్ కలాం ఆజాద్‌కు ఘన నివాళి

సబ్బవరం: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో భారతదేశ మొదటి విద్యాశాఖామంత్రి మౌలానా అబుల్ కలాం ఆజాద్‌కు సోమవారం ఘనంగా నివాళులర్పించారు. ఆయన జయంతి సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ బి.శంకర్ మాట్లాడుతూ భారతరత్న డాక్టర్ అబుల్ కలాం ఆజాద్ మంచి విద్యావేత్త అని, సాహిత్యం,రాజకీయ అనుభవం కలిగిన మహోన్నత వ్యక్తి అని తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు డాక్టర్ ఎస్. సత్యనారాయణ, ఎం.వి.రామకృష్ణ, తీయ సేవా పథకం సమన్వయకర్త లెక్కల గణేష్ తదితరులు పాల్గొన్నారు.

త్వరితగతిన భూ సమస్యల పరిష్కారం



రైతుల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న రీ సర్వే డీటీ గణేష్

సబ్బవరం: గ్రామ రెవెన్యూ సదస్సు దృష్టికి తీసుకొచ్చిన భూ సమస్యలను త్వరితగతిన పరిష్కరిస్తామని రీ సర్వే డిప్యూటీ తహసీల్దార్ గణేష్ తెలిపారు. పైడివాడ అగ్రహారంలో సోమవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో ఆయన రైతుల నుంచి 103 అర్జీలను స్వీకరించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ గత రీ సర్వేలో 2,342 ఎల్‌పీఎంలు ఇచ్చినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల సర్వేయర్ లాలం అప్పారావు,ఎంపీటీసీ సీరం అప్పలరాజు,గ్రామ పెద్దలు అక్కిరెడ్డి దుర్గినాయుడు,గొంతిన పైడిరాజు,సరిపల్లి విష్ణు తదితరులు పాల్గొన్నారు.

నృత్య కళా వేదిక ప్రారంభం



కళా వేదికను ప్రారంభిస్తున్న నృత్య దర్శకులు హేమసాయి

పరవాడ: పి.బొనంగి సంస్కృతి గ్లోబల్ పాఠశాలలో నూతనంగా ఏర్పాటు చేసిన సంస్కృతి నృత్య కళా వేదికను దూరదర్శన్ నృత్య దర్శకురాలు హేమసాయి సోమవారం జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నృత్య విద్యార్థుల ఉన్నతికి ఈ వేదిక దోహదపడుతుందన్నారు. అనంతరం ఆమెను పాఠశాల డైరెక్టర్ పి.ఉదయనాగశ్రీ, ప్రిన్సిపాల్ ఎన్.సీతాలక్ష్మి సత్కరించారు. ఈ కార్యక్రమంలో కోఆర్డినేటర్ రామలక్ష్మి, ఉపాధ్యాయులు పూజిత, లీలా పాల్గొన్నారు.

డెంగ్యూతో వ్యక్తి మృతి

సింహాచలం: డెంగ్యూతో శనివారం ఓ వ్యక్తి మృతిచెందాడు. స్థానిక గ్రామీణ ఆరోగ్యకేంద్రం సమీపంలోని శిడగం పేటకి వెళ్లే వీధిలో నివసిస్తున్న కళిరెడ్డి జనార్దన్(30)నాలుగు రోజుల కిందట అస్వస్థతకు గురయ్యాడు.అడవివరం ఆరోగ్యకేంద్రంలో చికిత్స చేయించుకున్నాడు. శుక్రవారం ఉదయం పరిస్థితి విషమంగా మారడంతో కుటుంబసభ్యులు జనార్దన్‌ని కేజీహెచ్‌కి తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ శనివారం ఉదయం మృతిచెందాడు. జనార్దన్ డెంగ్యూతో మృతిచెందాడని కేజీహెచ్ వైద్యులు తెలిపినట్టు జనార్దన్ కుటుంబ సభ్యులు చెప్పారు. మృతుడికి భార్య సాయి కుమారి, మూడేళ్ల కొడుకు ఉదయ్ ఉన్నారు.

ఉత్తరాంధ్ర సదస్సు జయప్రదం చేయండి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న పీడీఎస్‌వో ప్రతినిధులు, విద్యార్థులు

పెందుర్తి: 'ఉత్తరాంధ్ర కరువు–వలసలు–విద్యా, ఉపాధరంగ సమస్యలు–కర్తవ్యాలు' అనే అంశంపై ఈ నెల 15న విజయనగరంలో నిర్వహించనున్న ఉత్తరాంధ్ర సదస్సును విజయవంతం చేయాలని ప్రగతి శీల ప్రజాస్వామ్య విద్యార్థి సంస్థ(పీడీఎస్‌వో) రాష్ట్ర కమిటీ ప్రతినిధి ఎస్.రుద్రి పిలుపునిచ్చారు. స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ఆవరణలో సదస్సు పోస్టర్‌ను సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం విద్యా విదానం ఆమోదయోగ్యంగా లేదన్నారు. యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని పిలుపునిచ్చారు. పీడీఎస్‌వో ప్రతినిధులు పార్థు, చైతన్య, తేజ తదితరులు పాల్గొన్నారు.



సముద్ర స్నానాలకు అనువైన ముత్యాలమ్మపాలెం తీరం



సాగర తీరం అందాలను తిలకించేందుకు ఎన్టీపీసీ నిర్మించిన సీ వాటర్ పార్కు



తిక్కవానిపాలెం తీరంలో ఎన్టీపీసీ నిర్మించిన అతి పొడవైన జెట్టీ

పర్యాటకుల స్వర్గధామం

- పిక్నిక్ స్పాట్లకు కేరాఫ్ ముత్యాలమ్మ పాలెం, తిక్కవానిపాలెం తీర ప్రాంతాలు
- కార్తీక మాసంలో వనభోజనాల సందడి
- సందర్శకుల మది దోచేలా ప్రకృతి అందాలు
- బీచ్‌ను ఆస్వాదించేలా సదుపాయాలు

పరవాడ: కార్తీక మాసం వచ్చిందంటే చాలు పరవాడ మండలంలోని ముత్యాలమ్మపాలెం, తిక్కవానిపాలెం తీర ప్రాంతాలు పర్యాటకులకు గుర్తుకొస్తాయి. పర్యాటకులకు స్వర్గధామంలాంటి ఈ రెండు తీర ప్రాంతాలు ఉమ్మడి విశాఖ జిల్లాలోనే ప్రధాన పిక్నిక్ స్పాట్లుగా పేరొందాయి. పరవాడ మండల కేంద్రానికి 12 కిలోమీటర్ల దూరంలోని ఈ తీర ప్రాంతాల చుట్టూ సహజసిద్ధంగా ఏర్పడిన సౌందర్య ప్రదేశాలు పర్యాటకులను కనువిందు చేస్తాయి. సువిశాలమైన తీర ప్రాంతాల అందాలు, కొండ చుట్టూ ఒంపులు తిరిగిన ఉప్పుటేరు, పచ్చని జీడిమామిడి, సరుగుడు తోటలు, ఆట పాటలకు అనువైన ఇసుక తెన్నులు, విశాలమైన, ఆట స్థలాలు పర్యాటకులకు స్వాగతం పలుకుతాయి. ఉవ్వెత్తున ఎగసిపడే సముద్ర కెరటాలు, ఆహ్లాదాన్ని పంచే తీరం నుంచి వచ్చే చల్లని పిల్లగాలులు, యువత ఆటపాటలకు అవసరమైన ఇసుక తెన్నులు, విశాలమైన ఆట స్థలాలు ఈ తీర ప్రాంతాల్లో కొలువుదీరాయి.



ముత్యాలమ్మపాలెం సమీపంలో కొలువుదీరిన ముత్యమాంబ ఆలయం

సందర్శకులను కట్టిపడేసే అందాలు..

ముత్యాలమ్మపాలెం తీరంలో అడు గు పెట్టడానికి ముందుగా శ్రీము త్యమాంబ అమ్మవారు, శ్రీ మా ధవ స్వామి ఆలయాలు దర్శనమిస్తాయి. తీరం నుంచి దలాయిపాలెం వరకు ఒంపులు తిరిగిన ఉప్పుటేరు, బోటు షికారుకు అనువైన ఉప్పుటేరు, సమీపంలోని జీడిమామిడి తోట లు, విశాలమైన తీర ప్రాంత అందాలు సందర్శకులను కట్టి పడేస్తాయి.



ముత్యాలమ్మపాలెం తీరంలో సూర్యోదయం వేళ ఇలా..



బోటు షికారుకు అనువైన ఉప్పుటేరు

ఇలా చేరుకోవాలి..

ముత్యాలమ్మపాలెం, తిక్కవానిపాలెం బీచ్‌లకు చేరుకోవాలంటే పట్టణాలు, గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చే పర్యాటకులు నేరుగా ఆర్టీసీ బస్సులపై పరవాడ, ఎన్టీపీసీ మీదుగా వాడచీపురుపల్లికి చేరుకోవాలి. అక్కడ నుంచి 4 కిలో మీటర్ల దూరంలోని తిక్కవానిపాలెం బీచ్‌కు ఆటోలు, ద్విచక్ర వాహనాలపై చేరుకోవచ్చు. వాడచీపురుపల్లికి 3 కిలోమీటర్ల దూరంలోని ముత్యాలమ్మపాలెం తీరం చేరుకోవడానికి ఆటోల సౌకర్యం ఉంది. గాజువాక, అనకాపల్లి పరిసర ప్రాంతాల నుంచి వచ్చే సందర్శకులు పరవాడ చేరుకుని అక్కడ నుంచి ఎన్టీపీసీ, వాడచీపురుపల్లి మీదుగా నేరుగా ఈ తీర ప్రాంతాలకు చేరుకోవచ్చు. ఈ రెండు బీచ్‌లకు చేరుకోవడానికి చక్కని తారు రోడ్లు నిర్మించారు. కార్తీక మాసంలో కుటుంబ సభ్యులు, స్నేహితులతో కలిసి ఆనందంగా.. సరదాగా గడిపేందుకు ఈ పిక్నిక్ స్పాట్లు ఎంతో బాగుంటాయి.

వనభోజనాలకు అనువైన ప్రదేశాలు..

ఎన్టీపీసీ జెట్టీ ప్రాంతంలో ఆహ్లాదకరమైన వాతావరణంలో కార్తీక వనభోజనాలు ఆరగించవచ్చు. తీరం సమీపంలోని వందల ఎకరాల్లో విస్తరించిన జీడిమామిడి తోటలు పిక్నిక్‌లకు అనువైన ప్రదేశాలు. ఇటువంటి ఇక్కడ అనేకమున్నాయి. యువత సందడికి, ఆటపాటలకు అనువైన ప్రదేశాలు, మైదానాలున్నాయి. ప్రమాదాలకు ఆమడ దూరంలో చిన్నా పెద్దా అనే తేడా లేకుండా సముద్ర స్నానాలు చేయడానికి వీలైన ప్రదేశం ముత్యాలమ్మపాలెం తీరం. ఎన్టీపీసీ నిర్మించిన అతి పొడవైన జెట్టీతోపాటు సందర్శకులు సేదదీరడానికి తీరంలో నిర్మించిన సిమెంటు గొడుగులు, తీరం అందాలను ఆస్వాదించడానికి వీలుగా నిర్మించిన సీ వాటర్ పార్కు, సుదూరంలో కనువిందు చేసే సింహాద్రి ఎన్టీపీసీ, హిందూజా పవర్ ప్లాంట్లకు చెందిన అతి పొడవైన చిమ్నీలు చూపరులను ఆకట్టుకుంటాయి.

దళితుల భూములపై టీడీపీ దౌర్జన్యం





పెందుర్తి మండలం జెర్రిపోతులపాలెం సర్వే నం.79/3, 89/1 డీ–ఫాం భూములను ఆక్రమించి టీడీపీ నాయకులు నిర్మిస్తున్న భవనాల వద్ద బాధితులు

- జెర్రిపోతులపాలెంలో దళితుల భూముల దురాక్రమణ
- డీ ఫారం భూముల్లో షాపింగ్ కాంప్లెక్స్‌ల నిర్మాణం
- బాధితుల్ని చంపేస్తామంటూ సర్పంచ్, మాజీ సర్పంచ్ బెదిరింపు
- నగర పోలీస్ కమిషనర్‌ను ఆశ్రయించిన బాధితులు

పెందుర్తి: మండలంలోని జెర్రిపోతులపాలెంలో అధికార తెలుగుదేశం పార్టీ నాయకుల దౌర్జన్యకాండ కొనసాగుతోంది. గ్రామంలోని దళితులు, బీసీలకు చెందిన డీ ఫారం భూములను చెరబట్టిన టీడీపీ సానుభూతి సర్పంచ్ మడక అప్పలరాజు, మాజీ సర్పంచ్ వడిశల శ్రీను అందులో నిబంధనలకు విరుద్ధంగా షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణం చేపట్టారు. దీనిపై ఫిర్యాదులు అందుకున్న రెవెన్యూ అధికారులపై 'మమ్మల్ని అడ్డుకోవడానికి మీరెవరు'అంటూ చిందులు తొక్కుతున్నారు. తమకు చెందిన భూముల్లో నిర్మాణాలు వద్దని బాధితులు అడ్డుకునే ప్రయత్నం చేస్తే చంపుతామని బెదిరిస్తున్నారు. దీంతో బాధితులు బత్తిన బంగారయ్య, బత్తిన శ్రీను, సాలాపు ఈశ్వరరావు, సాలాపు బంగారాజు సోమవారం నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చీని ఆశ్రయించారు. తమపై టీడీపీ ప్రజాప్రతినిధులు చేస్తున్న దౌర్జన్యాన్ని ఏకరువు పెట్టారు. తమకు న్యాయం చేయాలంటూ తమ హక్కు పత్రాలను ఫిర్యాదుకు జతచేశారు. గతంలో ఇదే గ్రామంలో ఇదే టీడీపీ నాయకులు దళితుల భూములను ఆక్రమించుకుని, ఎదురు తిరిగిన దళిత మహిళను వివస్త్రను చేసిన ఘటన సంచలనం సృష్టించిన సంగతి తెలిసిందే. తాజాగా మళ్లీ వారే అదే తరహా దౌర్జన్యానికి దిగడం గమనార్హం.

డీ–ఫాం భూమిలో షాపింగ్ కాంప్లెక్స్‌లు

నిబంధనల ప్రకారం డీ ఫారం భూముల్లో నిర్మాణాలు చేపట్టకూడదు. జెర్రిపోతులపాలెంలోని టీడీపీ సానుభూతి సర్పంచ్ అప్పలరాజు, మాజీ సర్పంచ్ వడిశల శ్రీను మాత్రం పైన పేర్కొన్న బాధితుల భూమిని ఆక్రమించుకుని, ఏకంగా వాణిజ్య సముదాయాలు నిర్మిస్తున్నారు. ఈ క్రమంలో ఆయా నిర్మాణాలపై కొద్ది రోజుల క్రితం ఫిర్యాదులు అందుకున్న రెవెన్యూ అధికారులు నిర్మాణాలు నిలపాలని ఆదేశించారు. 'మీ తహసీల్దార్‌ను ఇక్కడకు రమ్మను. ప్రభుత్వం మాది. మాకు నచ్చినట్లు నిర్మాణాలు చేసుకుంటాం'అంటూ రెవెన్యూ అధికారుల్నీ బెదిరించడం వారి దౌర్జన్యానికి పరాకాష్ట.

తీరు మారలేదు

జెర్రిపోతులపాలెంలో టీడీపీ నాయకుల భూ ఆక్రమణల గురించి ఎంత తక్కువ చెప్పుకుంటే అంత మంచిది. మడక అప్పలరాజు, వడిశల శ్రీను ఇద్దరూ మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణ మూర్తికి అత్యంత సన్నిహితులు. 2014–19 సమయంలో ఇక్కడ ఎమ్మెల్యే బండారు ఉన్న సమయంలో గ్రామంలోని దళితుల భూములను ఆక్రమించుకున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. ముఖ్యంగా 2017లో దళితులకు చెందిన భూమిని ఎన్టీఆర్ గృహకల్ప పేరుతో లాక్కునే ప్రయత్నం చేశారు. ఆ సమయంలో దళితులు తిరగబడ్డారు. దీంతో రంజా దుర్గమ్మ అనే మహిళను వివస్త్రను చేసిన ఘటనలో అప్పలరాజు సహా ఏడుగురు అరెస్టయ్యారు. ఈ ఘటన అప్పట్లో దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. తాజాగా తమ భూములను ఆక్రమించారంటూ దళితులు పోలీసులను ఆశ్రయించడం గమనార్హం. తమకు తగిన న్యాయం చేయాలని బాధితులు ఉన్నతాధికారులను కోరుతున్నారు.

ఓం నమో శివ రుద్రాయా..

- ఘనంగా కార్తీక మాస రెండో సోమవారం పూజలు
- భక్తులతో కిటకిటలాడిన శైవక్షేత్రాలు

పెందుర్తి: కార్తీక మాసోత్సవాల్లో భాగంగా రెండో సోమవారం శైవక్షేత్రాలు భక్తులతో పోటెత్తాయి. నియోజకవర్గంలోని ఆలయాలన్నీ కిటకిటలాడాయి. మహాశివుడిని అభిషేకాలు, అర్చనలతో ఆరాధించారు. పెందుర్తి సాధూ మఠం వద్ద ఉన్న పురాతన రామలింగేశ్వరస్వామి దేవాలయంలో రుద్రాభిషేకాలు జరిగాయి. వందలాది మంది భక్తులు మహాశివుడికి పూజలు చేశారు.

- పినగాడి చోడేశ్వరస్వామి దేవాలయంలో విశేష అభిషేకాలు, అర్చనలు చేశారు. శివుడిని దర్శించుకునేందుకు భక్తులు బారులుతీరారు. మధ్యాహ్నం నిర్వహించిన భారీ అన్నసమారాధనలో దాదాపు 5 వేల మంది భక్తులు పాల్గొన్నారు.
- సరిపల్లి శివాలయంలో భక్తులు స్వహస్తాలతో శివుడికి క్షీరాభిషేకాలు జరిపారు. మహానంది, ధ్వజస్తంభాలకు మహిళలు పూజలు చేశారు.
- కష్ణరాయపురం శివాలయం, శ్రమశక్తినగర్ రామలింగస్వామి దేవాలయం, ప్రశాంతినగర్, చింతల గ్రహారం శివాలయం, సుజాతనగర్‌లోని హరహర క్షేత్రం, పెందుర్తి మహాకామేశ్వరి అమ్మవారి ఆలయంలోని జ్యోతిర్లింగాల సన్నిధిలో ఘనంగా పూజలు జరిగాయి.



విజినిగిరిపాలెంలో పూజలందుకున్న ఉమాచంద్రమౌళేశ్వర స్వామి



దేవీపురంలో పంచభూత లింగేశ్వరుడికి అభిషేకాలు చేస్తున్న చిన్నారులు



చోడేశ్వరస్వామి దేవాలయంలో పూజలందుకున్న మహా శివుడు



మొగలిపురంలో నిర్వహిస్తున్న దీపార్చన

భక్తిశ్రద్ధలతో శివుడికి పూజలు

సింహాచలం: కార్తీక మాసం రెండో సోమవారం సందర్భంగా సింహగిరిపై, అడవివరంలోని శివాలయాలు భక్తులతో కిక్కిరిశాయి. సింహగిరి క్షేత్రపాలకుడు త్రిపురాంతక స్వామి, కాశీ విశ్వేశ్వరస్వామి ఆలయాల్లో భక్తులు పరమేశ్వరుడికి అభిషేకాలు నిర్వహించారు. సాయంత్రం ఆకాశదీపారాధనలు ఘనంగా నిర్వహించారు. త్రిపురాంతకస్వామి ఆలయ ప్రాంగణంలోని నాగేంద్రుడి వద్ద మహిళలు దీపారాధనలు చేశారు. శివలింగానికి పూజలు జరిపారు. కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలోని రావి, వేప, మర్రి చెట్టుల వద్ద పెద్ద ఎత్తున దీపారాధన చేశారు. గంగధార వద్ద భక్తులు స్నానాలు ఆచరించి అక్కడి శివలింగాలకు పూజలు జరిపారు. కొండదిగువ పూలతోటలోని ప్రాచీన శివలింగం వద్ద భక్తులు పూజలు, గంగాజలాలతో అభిషేకాలు నిర్వహించారు.

- 98వ వార్డు అడవివరం పరిధిలోని పాత అడవివరం, కాపుదిబ్బ, స్వామి కల్యాణ మండపం వద్ద ఉన్న శివాలయాలకు భక్తులు పోటెత్తారు. శివుడికి అభిషేకాలు, సాయంత్రం ఆకాశ దీపారాధనలు చేశారు. సింహపురి కాలనీ శివాలయంలో పెద్ద ఎత్తున భక్తులు శంకరుడికి అభిషేకాలు జరిపారు. ధ్వజస్తంభాలు, తులసికోట, ఉసిరిచెట్టు వద్ద దీపారాధన చేశారు. విజినిగిరిపాలెం దరి చంద్రా గార్డెన్స్‌లోని ఉమాచంద్రమౌళీశ్వర స్వామి ఆలయంలో అభిషేకాలు, పూజలు, రుద్రాభిషేకాలను అర్చకుడు ఉదయ్‌కృష్ణశర్మ ఘనంగా నిర్వహించారు.
- 93వ వార్డు ప్రహ్లాదపురం శివాలయంలో భక్తులు అభిషేకాలు, పెద్ద ఎత్తున దీపారాధనలు చేశారు.

ఆధ్యాత్మిక క్షేత్రంలో..

సబ్బవరం: ఆధ్యాత్మిక క్షేత్రం దేవీపురంలోని కొండ మీద శివాలయంలో కొలువైన రాజరాజేశ్వరుడు, ఆనంద భైరవులకు భక్తులు ద్రవ్యాలతో అభిషేకాలు నిర్వహించారు. దక్షవాటిలో మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, ప్రాంగణంలోని ఆగ్నేయ దిక్కులో ఉన్న హోమశాలలో మహావాంచ కల్పగణపతి సహిత రుద్ర హోమం జరిపారు.

సహస్ర దీపార్చన

మొగలిపురంలోని విఘ్నేశ్వర ఈశ్వర గాట్ వద్ద గల ఈశ్వర ఆలయంలో వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు గండి రవికుమార్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. వేకువజాము నుంచి అధిక సంఖ్యలో అయ్యప్ప మాలధారులు స్వామిని దర్శించుకున్నారు. అనంతరం నిర్వహించిన అన్న సమారాధనను రవికుమార్ చేతుల మీదుగా ప్రారంభించారు. సాయంత్రం 3 వేల దీపాలతో సహస్ర దీపార్చన నిర్వహించారు. కార్యక్రమంలో అయ్యప్పస్వామి సేవా పీఠం స్వాములు, పార్టీ యువజన విభాగం అధ్యక్షులు యడ్ల నాయుడు, ఉప సర్పంచ్ సిరపరపు వాసు, ఐడి బాబు, ఎమ్మెల్యే దేముడు తదితరులు పాల్గొన్నారు.

పీజీఆర్ఎస్‌కు 10 వినతులు



వినతులు పరిశీలిస్తున్న జెడ్సీ హైమావతి

పెందుర్తి: వేపగుంట జీవీఎంసీ జోన్–8 కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక(పీజీఆర్ఎస్) కార్యక్రమానికి వివిధ సమస్యలపై 10 వినతులు అందాయి. 98వ వార్డు సింహచలంలో ఓ కల్యాణ మండపం నిర్మాణంపై, 90వ వార్డు నరసింహనగర్‌లో అక్రమ నిర్మాణం, 95వ వార్డు సుజాతనగర్(చినముషిడివాడ సర్వే నంబర్ 179/2)లో అక్రమ నిర్మాణం, 97వ వార్డు చినముషిడివాడ లక్ష్మీనగర్‌లో అక్రమ నిర్మాణంపై చర్యలు తీసుకోవాలని, 97వ వార్డు సుజాతనగర్ బీ–జోన్‌లో డ్రైనేజీ సమస్య పరిష్కరించాలని, 93వ వార్డు కృష్ణానగర్‌లో రోడ్డు స్థలం ఆక్రమణపై చర్యలు తీసుకోవాలని, 97వ వార్డు లక్ష్మీనగర్‌లో అక్రమంగా నిర్మించిన దుకాణంపై చర్యలు తీసుకోవాలని, 96వ వార్డు పెందుర్తికి చెందిన మహిళ వితంతువు పింఛన్ ఇప్పించాలని, 92వ వార్డు ప్రజా సమస్యలు పరిష్కరించాలని, 89వ వార్డు తాగునీటి సమస్య పరిష్కరించాలని జోనల్ కమిషనర్ హైమావతిని కోరారు. ఆయా వినతులను స్వీకరించి సంబంధిత అధికారులకు సమస్యల పరిష్కారానికి జెడ్సీ ఆదేశాలు జారీ చేశారు. కార్యక్రమంలో జోన్–8 అన్ని శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

బెల్ట్ షాపుపై దాడి

- 16 క్వార్టర్ బాటిళ్ల స్వాధీనం.. వ్యక్తి అరెస్ట్

పెందుర్తి: పెందుర్తి పోలీస్ స్టేషన్ పరిధిలోని జీవీఎంసీ 88వ వార్డు సతివానిపాలెంలో నిర్వహిస్తున్న మద్యం బెల్ట్ దుకాణంపై పెందుర్తి పోలీసులు సోమవారం దాడి చేశారు. దుకాణం నిర్వహిస్తున్న పాంద్రంగి సూరిబాబు అనే వ్యక్తిని అరెస్ట్ చేసి అతడి వద్ద ఉన్న 16 క్వార్టర్ మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు సీఐ కె.వి.సతీష్‌కుమార్ ఓ ప్రకటనలో తెలిపారు.

ప్రభుత్వ భూమి స్వాధీనం



సాక్షి ఎఫెక్ట్..

ప్రభుత్వ భూమిలో ఆక్రమణలు తొలగిస్తున్న అధికారులు

పరవాడ: వాడచీపురుపల్లిలో ఆక్రమణలకు గురైన ప్రభుత్వ భూమిని అధికారులు సోమవారం స్వాధీనం చేసుకున్నారు. ఈ నెల 9న 'ప్రభుత్వ స్థలం స్వాధీనం చేసుకోవాలని వినతి' అనే శీర్షికన 'సాక్షి'లో ప్రచురితమైన వార్తకు రెవెన్యూ అధికారులు స్పందించారు. వెస్ట్ రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్ 398/15లో 0.34 సెంట్ల ప్రభుత్వ భూమిని స్థానికులు కొందరు ఆక్రమించి పలు రకాల చెట్లు నాటారు. ఫలితంగా ఈ భూమిలో ఏర్పాటు చేసుకున్న శ్మశానవాటిక లేకుండా పోయింది. ఈ విషయాన్ని వైఎస్సార్‌సీపీ నాయకుడు మాసవరపు అప్పారావు పరవాడ తహసీల్దార్ ఎస్వీ అంబేడ్కర్ దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన రెవెన్యూ అధికారులు ప్రభుత్వ స్థలంలో నాటిన చెట్లను పొక్లెయిన్‌తో తొలగించి స్వాధీనం చేసుకొని శ్మశానవాటికకు కేటాయించారు. వాడచీపురుపల్లి వీఆర్వో ఆర్.హేమలత, సర్వేయర్ అనిల్, వీఆర్ఏలు పాల్గొన్నారు.

సామాన్యులకు భారంగా నిత్యావసర సరకులు



ధరల పెరుగుదలపై ఆందోళన చేస్తున్న సీపీఎం నాయకులు, స్థానికులు

పెందుర్తి: కూటమి ప్రభుత్వంలో నిత్యావసర సరకులు సామాన్యులకు అందకుండా పోతున్నాయని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యురాలు బి.రమణి విమర్శించారు. రాష్ట్రంలో పెరుగుతున్న కూరగాయలు, నిత్యావసర వస్తువుల ధరలకు నిరసనగా సీపీఎం ఆధ్వర్యంలో సోమవారం సప్తగిరినగర్‌లో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎన్నికల సమయంలో సరకుల ధరలు పెరగకుండా ప్రజలకు అండగా ఉంటామని గద్దెనెక్కిన టీడీపీ–జనసేన–బీజేపీ ప్రభుత్వం.. అధికారం చేపట్టాక ప్రజల నడ్డివిరుస్తోందని.. సీఎం చంద్రబాబు పాలనలో సామాన్యుల కడుపు నిండా తినే పరిస్థితి కూడా లేదన్నారు. సీఎం చంద్రబాబుకు మోసం తప్ప ప్రజల బాగోగులు పట్టవని ధ్వజమెత్తారు. చివరకు బడ్జెట్ విషయంలో కూడా సూపర్ సిక్స్ హామీలకు తూట్లు పొడిచారని విమర్శించారు. సోమవారం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో కూటమి ప్రభుత్వం పూర్తిగా ప్రజలను వంచించిందన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రవేటీకరణతోపాటు ఇతర ప్రభుత్వ రంగ సంస్థల ప్రవేటీకరణ ఆపాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం స్పందించి నిత్యావసర సరకుల ధరలను అదుపులోకి తీసుకురావాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ప్రజలతో కలిసి తీవ్రస్థాయిలో ఉద్యమం చేస్తామని రమణి హెచ్చరించారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు అప్పలనాయుడు, మహేష్, అన్నపూర్ణ, మహాలక్ష్మి, ముత్యాలమ్మ, రాజు తదితరులు పాల్గొన్నారు.

అధిక ధరలు తగ్గించాలి

పరవాడ: అధిక ధరలను తగ్గించి, విద్యుత్ ట్రూ అప్ చార్జీల ప్రతిపాదనను వెనక్కి తీసుకోవాలని సీపీఎం నాయకులు పి.మాణిక్యం డిమాండ్ చేశారు. సీపీఎం ప్రజాపోరు ప్రచార వాల్‌పోస్టర్‌ను పరవాడ జేఎన్ఎన్‌యూఆర్ఎం కాలనీ వద్ద సోమవారం ఆవిష్కరించారు.

ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పించాలని, స్టీల్ ప్లాంటు ప్రైవేటీకరణ ప్రక్రియను విరమించుకోవాలని డిమాండ్ చేశారు. భారీగా పెరుగుతున్న నిత్యావసరాల ధరలను అదుపు చేయడంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని విమర్శించారు. కార్మిక రైతు వ్యతిరేక విధానాలపై ప్రజలు ఉద్యమించాలని మాణిక్యం పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రమణమ్మ, పార్వతి, లక్ష్మి, సూర్యకుమారి తదితరులు పాల్గొన్నారు.